ఎఫ్ఎల్‌వో చైర్‌పర్సన్ రీతూషాతో ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి

ఫిక్కీ లేడీస్‌తో ఏఐజీ హాస్పిటల్స్ ఒప్పందం

మహిళా ఆరోగ్య సమస్యలపై అవగాహనా కార్యక్రమం

హైదరాబాద్, అక్టోబర్ 20: మహిళలకు సంబంధించిన వివిధ ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్‌వో) కలిసి ఒక సమగ్ర అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఏఐజీ హాస్పిటల్స్ తెలిపింది. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు తొలిదశలోనే స్క్రీనింగ్ ప్రాధాన్యతను మహిళలకు తెలియపరుస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా తమ హాస్పిటల్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ నుంచి మహిళా వైద్యులు, ఎఫ్ఎల్‌వో లీడర్స్‌తో ఒక చర్చాగోష్ఠి నిర్వహించినట్టు ఏఐజీ వెల్లడించింది. ప్రపంచ ప్రమాణాలతో ఆరోగ్య సంరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, ఫిక్కీ ఎఫ్ఎల్‌వోతో భాగస్వామ్యం ద్వారా విస్తృతస్థాయిలో ప్రజలకు చేరువ కావాలన్నది, మహిళల ఆరోగ్య సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నది తమ లక్ష్యమని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర రెడ్డి వివరించారు. బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల దేశవ్యాప్తంగా మహిళలకు అవగాహన కల్పించడంలో ఏఐజీ హాస్పిటల్స్‌తో కలిసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు ఫిక్కీ ఎఫ్ఎల్‌వో చైర్‌పర్సన్ రీతు షా తెలిపారు.

పసిడికి పండుగ కళ

మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

ఒక్కరోజే రూ.770 ఎగిసిన తులం రేటు

హైదరాబాద్‌లో రూ.61,530కి చేరిక

వెండి మార్కెట్‌లో స్థిరత్వం

గోల్డ్ మార్కెట్ పండుగ కళను సంతరించుకున్నది.

మొన్నటిదాకా పడుతూలేస్తూ సాగిన పసిడి ధరలు.. ఇప్పుడు వేగాన్ని అందుకున్నాయి.

ఒక్కరోజే దేశీయంగా తులం రూ.700లకుపైగా ఎగిసిన పుత్తడి విలువ.. హైదరాబాద్‌లో రూ.61,500లను దాటేసింది.

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: పండుగల వేళ పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. శుక్రవారం ఒక్కరోజే హైదరాబాద్ మార్కెట్‌లో తులం 24 క్యారెట్ స్వచ్ఛమైన బంగారం ధర రూ.770 పుంజుకున్నది. దీంతో రూ.61,530కి చేరుకున్నది. అంతకుముందు రెండు రోజుల్లోనూ రేట్లు పెరుగగా.. వరుసగా ఈ మూడు రోజుల్లో రూ.1,580 ఎగిసింది. 22 క్యారెట్ ఆభరణాల బంగారం 10 గ్రాములు సైతం రూ.700 ఎగబాకింది. రూ.56,400లుగా ఉన్నది. మూడు రోజుల్లో రూ.1,450 పెరిగింది. ఇక దేశ రాజధాని నగరం ఢిల్లీ మార్కెట్‌లోనూ పుత్తడి ధరలు దూకుడు మీదున్నాయి. 24 క్యారెట్ 10 గ్రాములు రూ.61,650 పలుకుతున్నది. గురువారంతో పోల్చితే మరో రూ.750 అందిపుచ్చుకున్నది.

పెరిగిన డిమాండ్

ప్రస్తుత పండుగల సీజన్, రాబోయే పెండ్లిళ్ల సీజన్ రెండూ.. గోల్డ్ మార్కెట్‌కు కొత్త కళను తెచ్చిపెట్టాయి. బంగారం దుకాణాల్లో ఇప్పుడు కొనుగోలుదారుల సందడి కనిపిస్తున్నది. ధరలు క్రమేణా పెరుగుతుండటం కూడా.. కష్టమర్లను మార్కెట్‌కు రప్పిస్తున్నదని పలువురు దుకాణదారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చే నెల దీపావళికి పుత్తడి ధర మరింత పెరుగవచ్చన్న అంచనాలూ వినిపిస్తున్నాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో..

మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్ రష్ కొనసాగుతున్నది. ఔన్స్ బంగారం 1,980 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్‌లో ట్రెండ్ బలహీనంగా ఉండటంతో మదుపరులు పుత్తడిపై పెట్టుబడులకు ఆసక్తిని కనబరుస్తున్నట్టు ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలకు ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం తోడవడంతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం వైపునకొస్తున్నారు. ఈ క్రమంలోనే కొమెక్స్ స్పాట్ గోల్డ్ దాదాపు 4 నెలల గరిష్ఠాన్ని తాకింది. ఇదిలావుంటే వెండి ఔన్స్ 23.20 డాలర్లుగా ఉన్నది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.77,500 వద్ద స్థిరంగా కొనసాగుతున్నది. అయితే ఢిల్లీలో రూ.500 పెరిగి రూ.74,700లకు చేరింది.

గోల్డ్ ఈటీఎఫ్‌లకు తగ్గిన ఆదరణ

గత నెల గోల్డ్ ఎక్స్చేంజ్-ట్రేడెడ్ ఫండ్లకు ఆదరణ తగ్గింది. సెప్టెంబర్‌లో రూ.175 కోట్లకే పెట్టుబడులు పరిమితమయ్యాయి.

అంతకుముందు నెల ఆగస్టులో 17 నెలల గరిష్ఠాన్ని తాకిన విషయం తెలిసిందే. నాడు రూ.1,028 కోట్లుగా ఉన్నాయి. అయితే మదుపరులు లాభాల స్వీకరణకు పెద్దపీట వేయడం వల్లే తాజా గణాంకాలు నిరాశాజనకంగా ఉన్నాయని దేశీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం (యాంఫీ) తెలియజేసింది. కానీ అమెరికాలో పెరుగుతున్న వడ్డీరేట్లు, అంచనాలకు మించి నమోదవుతున్న ద్రవ్యోల్బణం, మందగిస్తున్న వృద్ధిరేటు మధ్య గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ ముమ్ముందు ఉంటుందనే విశ్వాసాన్నే ఇండస్ట్రీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదిలావుంటే ఈ జనవరి-మార్చిలో ఏకంగా రూ.1,243 కోట్ల ఉపసంహరణలు జరిగాయి. నిరుడు జూలై-డిసెంబర్ మధ్య కూడా రూ.485 కోట్లు వెనక్కిపోయాయి.

సెమ్స్‌తో సైయెంట్ జట్టు

ముంబై, అక్టోబర్ 20: డిజిటల్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సేవల సంస్థ సైయెంట్..విద్యార్థుల్లో ప్రతిభను మెరుగుపరచడానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్(సెమ్స్)తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ముంబైలో జరిగిన గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్‌లో ఈ ఒప్పందంపై ఇరువురి సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు.

కేఫిన్ టెక్నాలజీ లాభం 61 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్ 20: టెక్నాలజీ ఆధారిత ఆర్థిక సేవల సంస్థ కేఫిన్ టెక్నాలజీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం 28 శాతం ఎగబాకి రూ.61.4 కోట్లుగా నమోదైంది. కిందటి ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.47.92 కోట్లు గడించింది. కంపెనీ ఆదాయం 16 శాతం ఎగబాకి రూ.209 కోట్లకు చేరుకున్నది. గత త్రైమాసికంలో కొత్తగా 172 కార్పొరేట్ క్లయింట్లను ఆకట్టుకున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో శ్రీకాంత్ నాదెళ్ల తెలిపారు.

దివాలా ప్రక్రియకు జీవీకే గౌతమీ పవర్

హైదరాబాద్, అక్టోబర్ 20: జీవీకే గౌతమీ పవర్ లిమిటెడ్‌పై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ ధర్మాసనం దివాలా ప్రక్రియను శుక్రవారం ప్రారంభించింది. ఈ మేరకు జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (జీవీకేపీఐఎల్) తెలియజేసింది. జీవీకే గౌతమీ పవర్ లిమిటెడ్‌పై ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్సీ కోడ్ 2016 కింద ఎడిల్‌వీజ్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఈఏఆర్‌సీ) దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్.. పైవిధంగా ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నది. ఇదిలావుంటే ఈ కేసులో మధ్యంతర రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ)గా అనిల్ కోహ్లీని ఎన్‌సీఎల్‌టీ నియమించింది.

సెంట్రల్ బ్యాంక్ లాభం రెండింతలు

క్యూ2లో రూ.605 కోట్లుగా నమోదు

ముంబై, అక్టోబర్ 20: ప్రభుత్వరంగ సంస్థ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రికార్డు స్థాయి లాభాలను గడించింది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.605 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.318 కోట్ల లాభంతో పోలిస్తే రెండు రెట్లు పెరిగినట్టు వెల్లడించింది. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 505 బేసిస్ పాయింట్లు పెరిగి 4.62 శాతానికి తగ్గడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని పేర్కొంది. అలాగే బ్యాంక్ నికర ఎన్‌పీఏ 2.05 శాతం నుంచి 1.64 శాతానికి దిగొచ్చింది. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 89.20 నుంచి 92.54కి పెరిగింది. గత త్రైమాసికం చివరినాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.6 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించి రూ.6,02,284 కోట్లకు చేరుకున్నది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.5,40,130 కోట్లతో పోలిస్తే 11.51 శాతం అధికం. దీంట్లో డిపాజిట్లు 8.21 శాతం అధికమై రూ.3,71,252 కోట్లకు చేరుకోగా, అడ్వాన్స్‌లు 17.26 శాతం ఎగబాకి రూ.2,31,032 కోట్లకు చేరాయి. నికర వడ్డీ ఆదాయం 10.23 శాతం ఎగబాకి రూ.2,747 కోట్ల నుంచి రూ.3,028 కోట్లకు చేరుకున్నాయి. బ్యాంక్ ఆదాయం 19.07 శాతం ఎగబాకి రూ.7,065 కోట్ల నుంచి రూ.8,412 కోట్లకు చేరుకున్నట్టు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. బ్యాంక్‌కు 4,489 శాఖలు ఉండగా, వీటిలో సగం గ్రామీణ ప్రాంతాల్లో ఉండటం విశేషం.

పెద్దలకు వ్యాక్సినేషన్ కోసం కిమ్స్ హాస్పిటల్స్, ఫైజర్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఓ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను అందుబాటులోకి తెచ్చాయి. ఈ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

ఈవీల రంగంలో లక్షల ఉద్యోగాలు

లింకెడిన్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: భారతీయ ఆటోమోటివ్ ఇండస్ట్రీలో ఇప్పుడు 'ఎలక్ట్రిక్' అనేది అత్యంత ఆకర్షణీయ పదం. ఏడాది కిందటిదాకా స్టార్టప్‌లే విద్యుత్తు ఆధారిత వాహన (ఈవీ) పరిశ్రమలో ఎక్కువగా ఉన్నాయి. అయితే ప్రస్తుతం టాటా, మహీంద్రా, హ్యుందాయ్, కియా, ఎంజీ వంటి సంస్థలతోపాటు బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ వంటి లగ్జరీ కంపెనీలు సైతం ఈవీ మార్కెట్‌పై దృష్టి సారించాయి. దీంతో ఫోర్ వీలర్ మార్కెట్‌లో ఈవీల వాటా గణనీయంగానే పెరిగింది. టూవీలర్ మార్కెట్ పైనా హీరో, బజాజ్, టీవీఎస్ వంటి ప్రధాన సంస్థలు పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో భవిష్యత్తు ఈవీలదేనని లింకెడిన్ తమ తాజా నివేదికలో అభిప్రాయపడింది. రాబోయే కొన్నేండ్లలో దేశీయ ఈవీల రంగంలో లక్షలాది ఉద్యోగావకాశాలు వస్తాయని గ్లోబల్ గ్రీన్ స్కిల్స్ రిపోర్టు 2023లో పేర్కొన్నది. వాహన తయారీతోపాటు బ్యాటరీ, చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు డిమాండ్ పెరుగుతుందని, దీంతో వీటిల్లో కొత్త ఉద్యోగాలకు పెద్ద ఎత్తున వీలుంటుందని చెప్పింది. ఇప్పటికే అమెరికా, మెక్సికో, కెనడా, మరికొన్ని ఐరోపా దేశాలకు గట్టి పోటీనిచ్చేలా భారతీయ ఆటోమోటివ్ ఇండస్ట్రీలో ఈవీ నైపుణ్య కార్మికుల సంఖ్య పెరిగిపోతున్నదని గుర్తుచేసింది. 2030కల్లా భారతీయ ఈవీల రంగంలో కోటిదాకా ప్రత్యక్ష ఉద్యోగాలు, 5 నుంచి 5.5 కోట్లదాకా పరోక్ష ఉపాధి అవకాశాలు రావచ్చని రాండ్‌స్టడ్ ఇండియా డైరెక్టర్ సంజయ్ శెట్టి అన్నారు. హీరో ఎలక్ట్రిక్ ఏవీపీ హెచ్ఆర్ మనుశర్మ, రెవిన్ వ్యవస్థాపక సీఈవో సమీర్ అగర్వాల్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. పెట్రో ఆధారిత వాహనాల వినియోగంతో కాలుష్యం పెరుగుతుండటం, వాటి నిర్వహణ వ్యయం భారంగా మారడం కూడా ఈవీల వైపు వాహనదారులు చూస్తున్నారు.

స్టార్టప్ క్యాపిటల్ హైదరాబాద్

టీ-హబ్‌కు అంతర్జాతీయ గుర్తింపు

వివిధ రంగాల్లో 20కిపైగా ఇంక్యుబేటర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): దేశంలో స్టార్టప్ క్యాపిటల్‌గా హైదరాబాద్ అవతరించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రోత్సహించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందు కోసం టీ-హబ్‌ను ఏర్పాటు చేసింది. ఇది.. దేశంలోనే అత్యుత్తమ ఆవిష్కరణ వ్యవస్థను తెచ్చింది. ఫలితంగా ఇప్పుడు స్టార్టప్‌లకు స్వర్గధామంగా రాష్ట్రం మారింది. 2016లోనే రాష్ట్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ పాలసీని రూపొందించి అమల్లోకి తీసుకొచ్చింది. కేవలం ఐటీ రంగంలోనే కాకుండా ఔషధ, బయో, మెడికల్, వ్యవసాయ, మహిళ, సామాజిక అంశాల్లో ప్రత్యేకంగా స్టార్టప్‌లను ఏర్పాటు చేసేందుకు వీలుగా వేర్వేరు ప్రాంతాల్లో ఇంక్యుబేటర్‌లను ఏర్పాటు చేయించారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుతం స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు 20కిపైగా ఇంక్యుబేటర్లు పనిచేస్తున్నాయి. తెలంగాణలో శరవేగంగా స్టార్టప్ ఎకోసిస్టం మెరుగుపడటానికి ఇక్కడి నైపుణ్యం కలిగిన మానవ వనరులూ కారణమే. స్టార్టప్‌లకు ఫండింగ్ చేసేందుకు ఎంతోమంది పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతుండటం కూడా కలిసొస్తున్నది. ఐటీ రంగంలో ఎంతో ప్రగతి సాధించినట్టే స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధిలోనూ తెలంగాణ ప్రభుత్వం కృషి చేసింది.

అత్యుత్తమ ఆవిష్కరణ వ్యవస్థ

టెక్నాలజీ స్టార్టప్‌లేగాక విభిన్న రంగాలు, సామాజిక అంశాలకు ప్రాధాన్యతనిస్తూ స్టార్టప్‌లను ప్రోత్సహించే అనుకూల వాతావరణం ఇప్పుడు తెలంగాణ సొంతం. ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఇలా అన్నిచోట్ల సరికొత్త ఆలోచనలతో వచ్చేవారికి అండగా నిలిచేలా ఇంక్యుబేటర్‌లు ఏర్పాటయ్యాయి. టీ-హబ్‌తో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు ఇక్కడ స్టార్టప్‌లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు.

- టీ-హబ్ సీఈవో ఎం శ్రీనివాసరావు



టీ-హబ్ ప్రగతి ఇలా..

- **2 వేలకుపైగా స్టార్టప్‌లకు ప్రయోజనం**
- **ఇక్కడి స్టార్టప్‌లకు సమకూరిన రూ.1,860 కోట్ల నిధులు**
- **100కుపైగా ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు**
- **75కుపైగా ప్రముఖ కంపెనీల నుంచి స్టార్టప్‌లకు భాగస్వామ్యం**
- **టీ-హబ్ ఏర్పాటైన దగ్గర్నుంచి ఇప్పటిదాకా 1000కిపైగా ఈవెంట్లు**
- **600లకుపైగా కార్పొరేట్ కంపెనీలతో కలిసి స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమాలు**
- **400లదాకా అంతర్జాతీయ భాగస్వామ్య కార్యక్రమాలు**
- **టీ-హబ్ కేంద్రంగా 200లకుపైగా మెంటార్‌లు**
- **42 దేశాలు టీ-హబ్‌ను చూసి కొత్తగా ఆవిష్కరణల కోసం కార్యక్రమాలు**
- **టీ-హబ్‌ను ఇప్పటిదాకా సందర్శించిన 1.50 లక్షల మంది**

అల్ట్రాటెక్ అదరహో

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.1,280.38 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది అల్ట్రాటెక్ సిమెంట్. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.758.7 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 68.75 శాతం అధికం. 2022-23 ఏడాది రెండో త్రైమాసికంలో రూ.13,892. 69 కోట్లుగా నమోదైన కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.16,012.13 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. నిర్వహణ ఖర్చులు కూడా రూ.12,934 కోట్ల నుంచి రూ.14,493 కోట్లకు పెరిగినట్టు వెల్లడించింది. రెండో త్రైమాసికంలో దేశవ్యాప్తంగా సిమెంట్‌కు డిమాండ్ ఊపందుకున్నదని, ప్రభుత్వాలతోపాటు మౌలిక రంగ, గ్రామీణాభివృద్ధి, పట్టణాల్లో గృహాలకు డిమాండ్ ఉండటం కూడా ఇందుకు కలిసొచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. విద్యుత్ కోసం అయ్యే ఖర్చు 10 శాతం తగ్గగా, ముడి సరుకు ఖర్చులు 4 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది.



అధిక స్థాయిలోనే వడ్డీ రేట్లు

- **ఆర్బీఐ గవర్నర్ సంకేతాలు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: ద్రవ్యోల్బణం పట్ల రిజర్వ్‌బ్యాంక్ 'అత్యంత అప్రమత్తం'గా ఉంటుందని, ఈ రేటు 4 శాతానికి తగ్గేలా చూస్తుందని గవర్నర్ శక్తికాంత్ దాస్ చెప్పారు. తద్వారా అధిక వడ్డీ రేట్లు దీర్ఘకాలం కొనసాగుతాయన్న సంకేతాలిచ్చారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ నిర్వహించిన సదస్సులో ఆర్బీఐ గవర్నర్ మాట్లాడుతూ ధరల్ని అదుపు చేయడంపైనే ద్రవ్య విధానం దృష్టిపెడుతుందని, ప్రస్తుతం దిగివస్తున్న ద్రవ్యోల్బణం సజావుగా మరింత తగ్గేలా చూస్తుందన్నారు. అక్టోబర్ 6నాటి ద్రవ్య పరపతి విధాన సమీక్షలో కేంద్ర బ్యాంక్ వరుసగా నాల్గవసారి వడ్డీ రేట్లను యథాతథంగా అట్టిపెట్టిన సంగతి తెలిసిందే. దాస్ తాజా కఠిన వ్యాఖ్యలతో డాలరు మారకంలో రూపాయి విలువ శుక్రవారం బలపడి 83.08 స్థాయికి చేరింది. ఇటీవల రూపాయిపై ఏర్పడిన ఒత్తిడిని ఆర్బీఐ గవర్నర్ ప్రస్తావిస్తూ డాలరు బలపడటమే ఇందుకు కారణమని, అధిక ఒడిదుడుకుల్ని నిరోధించడానికి కేంద్ర బ్యాంక్ తరచూ కరెన్సీ మార్కెట్లో జోక్యం చేసుకుంటున్నదని అన్నారు. ఆర్బీఐ సెప్టెంబర్ సర్వేల్లో ప్రోత్సాహకర సంకేతాలు వెల్లడయ్యాయని, ద్రవ్యోల్బణం అంచనాల తగ్గుదలలో మరింత ప్రగతి కనపడుతున్నదని చెప్పారు. అయితే ఆహార ద్రవ్యోల్బణంపై పలు అనిశ్చితుల ప్రభావం ఉంటుందని హెచ్చరించారు.

ఇంకా రూ.10 వేల కోట్ల విలువైన రూ.2,000 నోట్లు రావాలి

ప్రజల వద్ద ఇంకా రూ. 10,000 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు ఉన్నాయని శక్తికాంత్ దాస్ వెల్లడించారు. ఈ నోట్లు సైతం తమ వద్దకు తిరిగి వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అక్టోబర్ 7తో బ్యాంక్ శాఖలు ఈ నోట్లను తీసుకోవడం నిలిపివేయగా, అక్టోబర్ 8 నుంచి ఆర్బీఐ కార్యాలయాల్లో మార్పిడికి అనుమతించిన సంగతి తెలిసిందే. ఒక దఫాలో రూ.20,000 వరకూ ఈ పెద్ద నోట్లను మార్చుకోవచ్చు. ఆర్బీఐ కార్యాలయాల ద్వారా వ్యక్తులు, సంస్థల బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవడానికి ఎటువంటి పరిమితీ లేదు.

లారస్ లాభంలో భారీ క్షీణత

హైదరాబాద్, అక్టోబర్ 20: లారస్ ల్యాబ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 84.1 శాతం తగ్గి రూ.37.12 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికానికిగాను సంస్థ రూ.233.39 కోట్ల లాభాన్ని గడించింది. అటు ఆదాయం కూడా 22.3 శాతం తగ్గి రూ.1,224 కోట్లకు పరిమితమైంది. మరోవైపు, ప్రతిషేరుకు 40 పైసలు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఆర్అండ్‌డీ కోసం రూ.58 కోట్ల నిధులు వెచ్చించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. రెండో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు అంచనావేసినట్టుగానే ఉన్నాయని కంపెనీ ఫౌండర్, సీఈవో సత్యనారాయణ చావా తెలిపారు.

క్రూడ్ దెబ్బకు ఢమాల్

మూడోరోజూ పడిపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు

ముంబై, అక్టోబర్ 20: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడంతోపాటు గ్లోబల్ సూచీలు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో దేశీయ సూచీలు అదేదారిలో పయనించాయి. ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోతుండటం మార్కెట్లను నష్టాల్లోకి నెట్టాయి. అమెరికా బాండ్ ఈల్డ్ మరింత బలోపేతం కావడంతో పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్ మెరుగుపడింది. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 231.62 పాయింట్లు కోల్పోయి 65,397.62 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 320 పాయింట్లు నష్టపోయిన సూచీ చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించింది. మరో సూచీ నిఫ్టీ కూడా 82.05 పాయింట్లు కోల్పోయి 19,542.65 వద్ద ముగిసింది. మొత్తంమీద ఈవారంలో సెన్సెక్స్ 885.12 పాయింటు (1.33 శాతం), నిఫ్టీ 208.4 పాయింట్లు (1.05 శాతం) పడిపోయింది.

- గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 1,030, నిఫ్టీ 268 పాయింట్లు కోల్పోయింది.
- ఐటీసీ షేరు 2.68 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టాటా స్టీల్, హెచ్‌యూఎల్ నష్టపోయాయి.
- వీటితోపాటు ఎస్బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, ఎల్అండ్‌టీ, యాక్సిస్‌బ్యాంక్, బజాజ్‌ఫైనాన్స్, టాటా మోటర్స్, విప్రో, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, మహీంద్రా, టైటాన్, ఇన్ఫోసిస్, మారుతి, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, టెక్ మహీంద్రాలు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.
- కానీ, కొటక్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టీసీఎస్, ఎన్‌టీపీసీ, నెస్లె, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్‌లు లాభాల్లో ముగిశాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.02 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్, కన్జ్యూమర్ డ్యూరబుల్, మెటల్, టెలికం, ఎఫ్ఎంసీజీ, కమొడిటీస్‌లు రెండు శాతం వరకు నష్టపోయాయి.
- గ్లోబల్ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 1.29 డాలర్లు పెరిగి 93.67 డాలర్లకు పెరగడం మార్కెట్లకు ప్రతికూలంగా నమోదైంది.

తగ్గిన స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు

4.3 కోట్ల డివైజ్‌లకు దిగుమతులు పరిమితం

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు 3 శాతం మేర తగ్గాయని కానలైజ్ రీసెర్చ్ వెల్లడించింది. తాజాగా ముగిసిన మూడు నెలల కాలంలో 4.3 కోట్ల స్మార్ట్‌ఫోన్లు మాత్రమే దిగుమతయ్యాయని తెలిపింది. త్రైమాసికం ప్రారంభంలో పలు కంపెనీల వద్ద నిల్వలు అధికంగా ఉన్నాయని, దీంతో దిగుమతులు తగ్గించుకున్నట్టు కానలైజ్ సీనియర్ అనలిస్ట్ సాన్యం చౌరాసియా వివరించారు. మార్కెట్ రికవరీ సంకేతాలు కన్పిస్తున్నప్పటికీ, టాప్ ఫైవ్ బ్రాండ్స్ అమ్మకాలు గత ఏడాదితో పోలిస్తే తగ్గాయన్నారు. పలు కంపెనీలు పండుగ సీజన్ కోసం స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లను విడుదల చేశాయని, ప్రత్యేకించి బడ్జెట్ ధరగల 5జీ హ్యాండ్‌సెట్లను ప్రమోట్ చేశాయని చౌరాసియా తెలిపారు. మార్కెట్ క్రమేపీ 5జీ ఎనేబుల్డ్ స్మార్ట్‌ఫోన్ల పట్ల మళ్లుతున్నదని, షావోమీ, రియల్‌మిలు ఆన్‌లైన్ అవుట్‌లెట్స్ ద్వారా చౌక 5జీ డివైజ్‌లతో అమ్మకాలు పెంచుకున్నాయన్నారు. మరోవైపు శామ్‌సంగ్ ఎస్23 సిరీస్, ఓల్డ్ జనరేషన్ యాపిల్ ఐఫోన్ల నేతృత్వంలో ప్రీమియం మార్కెట్ వృద్ధి కొనసాగుతున్నదన్నారు. క్యూ3లో స్మార్ట్‌ఫోన్ మార్కెట్ వివరాలు..

- 18 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ అగ్రస్థానాన్ని కొనసాగించింది. 79 లక్షల సామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్లు దిగుమతయ్యాయి.
- 76 లక్షల స్మార్ట్‌ఫోన్ల దిగుమతులతో షావోమి ద్వితీయస్థానానికి చేరింది. చౌక 5జీ మోడల్స్ ద్వారా ఈ ఫీట్ సాధించింది.
- 72 లక్షల డివైజ్‌ల దిగుమతులతో వివో తృతీయస్థానంలోనూ, రియల్‌మి 58 లక్షల యూనిట్లతో నాల్గవ స్థానంలోనూ, 44 లక్షల డివైజ్‌లతో ఒప్పో (ఒన్‌ప్లస్ మినహా) ఐదవ స్థానంలోనూ ఉన్నాయి.